స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 115 | శనివారం, సెప్టెంబర్ 12, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 115 | SATURDAY, SEPTEMBER 12, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## చట్ట సవరణతో పల్లెల బలోపేతం

- పంచాయతీలకు పూర్తి అధికారాలతో గ్రామస్వరాజ్యానికి బాట
- మహిళా సర్పంచుల పాత్ర మరింత బలోపేతం
- మహిళా సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటుపల్లి రేణుక

2

# పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

- విద్యార్థులు ఎవరి చేతుల్లోనో పావులుగా, కీలుబొమ్మలు కావొద్దు
- ముందు యుగం దూతలుగా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లోనూ కేంద్రం మార్గదర్శకాలు పాటిస్తున్నాం
- నిజాయితీగా వివరాలందించిన కాలేజీలకే విడతలవారీగా బకాయిల చెల్లింపు
- విద్యా రంగానికి ప్రజాప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):

విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలు, పాలిటెక్నిక్ విద్యలో తీసుకొచ్చిన మార్పులు, వాటిపై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు.. వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ వేదికగా స్పష్టమైన వివరణ ఇచ్చారు. "పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.97పై కొన్ని వివాదాలు తలెత్తాయని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తారనే ప్రచారాన్ని తోసిపుచ్చారు. "పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణ అనే ప్రసక్తే లేదు" అని సభలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలు ఇకపై కూడా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయి. కేవలం సాంకేతిక విద్యా వ్యవస్థను స్కిల్స్ యూనివర్సిటీ పరిధితో అనుసంధానం చేస్తున్నాం. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి టాటా సంస్థ సహకారంతో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. అంతమాత్రాన ఐటీఐలను ప్రైవేటు పరం చేసినట్లు కాదు. ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్ అందించాలని నిర్ణయించాం" అని చెప్పారు. పాలిటెక్నిక్‌ల విషయంలో భూములు అమ్ముకుంటారని, ఉద్యోగాలు పోతాయని కొందరు విద్యార్థుల్లో అపోహలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ప్రభుత్వం అదనంగా 282 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏటీసీలకు బదలాయించిందని, ఒక్కో ఏటీసీపై సుమారు రూ.46 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎవరి చేతుల్లోనో పావులుగా, కీలుబొమ్మలుగా మారొద్దని కోరారు. ముందు యుగం దూతలుగా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తున్నామని, మిగతా 2లో..



## ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం
- సీఎంను కలిసిన ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు
- పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలకు అసెంబ్లీ సమావేశాల్లోనే 3 డీఏలకు ఉత్తర్వులివ్వాలని వేడుకోలు..
- ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తామని సీఎం హామీ
- రెండు డీఏలకు ఏటా రూ.6వేల కోట్ల భారం పడుతుందని ఆర్థిక శాఖ అంచనా

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రెండు డీఏ(కరవు భత్యం)లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఉద్యోగ సంఘాలు పీఆర్‌సీ నివేదిక సహా పలు సమస్యలను వివరించగా, సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. అన్ని అంశాలపై ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తామని హామీ మిగతా 2లో..

## రైతుల మోటార్లకు మీటర్లు పెట్టం

రైతులకు ప్రజా ప్రభుత్వం నూటికి నూరుశాతం హామీ

- ఎక్కడా మీటర్లు పెట్టాలనే నిబంధన లేదు
- కేంద్రంతో ఉదయ్ ఒప్పందం చేసిందే గత ప్రభుత్వం
- ఆర్‌డీఎస్‌ఎస్‌లో వ్యవసాయ మీటర్ల నిబంధనే లేదు
- శాసన మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):



రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో మిగతా 2లో..

## 12.91 లక్షల మంది ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా

- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండా రూ.కోటి వరకు ప్రయోజనం
- ఇప్పటివరకు 89 ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం
- డిజిటల్ హెల్త్ కార్డులు, ఈహెచ్ఎస్‌కు రూ.264 కోట్ల కార్పస్
- శాసన మండలిలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం

2లో..



## ఓవర్సీస్ విద్యానిధికి రూ.179.90 కోట్లు విడుదల

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 3,008 మంది విద్యార్థులకు లబ్ధి

హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఆర్థిక ఊరట కల్పించింది. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధుల మిగతా 2లో..

## బొల్లారం బండారం బట్టబయలు

- ఆర్మీ ఆయుధాల చోరీ కేసును ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు
- క్రమశిక్షణ కారణంతో ఉద్యోగం కోల్పోయిన హవల్దార్ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ
- స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా ఉడిమిల్లలో ఆయుధాలు స్వాధీనం
- ఆయుధాల దొంగతనంతో దేశ భద్రతకు ఎలాంటి ముప్పు లేదు: డిజిపి సివి.ఆనంద్

2లో..






## రేవంత్ రాజ్యంలో గజానికో గజదొంగ

- ప్రజా సమస్యలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభ నుంచి గెంటేశారు
- తెలంగాణ భవన్‌లో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- 22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం
- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
- పరాకాష్ఠకు చేరిన భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు
- అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు
- గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు
- రాష్ట్రంలో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి'
- కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):

రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అన్యాయంగా మెడపట్టి గెంటేశారని, ప్రభుత్వ భూ బాగోతాలు బట్టబయలవుతాయనే భయంతోనే ఈ కుట్రకు పాల్పడ్డారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో హారతి కర్పూరంలా భూములను కొల్లగొడుతూ పాలన సాగిస్తున్నారని నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ పాలనలో సాగునీరు పారి ఎకరం రూ.5లక్షల నుంచి రూ.50 లక్షలకు చేరితే, నేడు రైతుల భూములను నిషేధిత జాబితా (22A) పేరుతో బంధిస్తున్నారని ఆరోపించారు. గతంలో కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉంటే, ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలను అందులోకి మిగతా 2లో..






## తెలంగాణ విమోచనోద్యమం కేవలం కమ్యూనిస్టుల రైతాంగ పోరాటం కాదు

- 1930ల నుంచే నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జాతీయవాదుల వీరోచిత పోరాటం
- మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.బూర నర్సయ్యగౌడ్

5లో..

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు
- తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆరఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆరఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మిగతా 2లో..





## అటవీ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ఆయుధాల కోసం రూ.4.095 కోట్ల ప్రతిపాదనలు
- 1,516 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది
- పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

2లో..

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 115
శనివారం
12 సెప్టెంబర్, 2026

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చినట్లు సమాచారం. కనీసం రెండు డీఏలు చెల్లిస్తే ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ. 6 వేల కోట్ల భారం పడుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసినట్లు సమాచారం. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల్లో రెండు డీఏలు చెల్లించే అవకాశం కనిపిస్తోంది. అందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 18న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించనున్నందున ఆరోజు ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. అసెంబ్లీలో గురువారం ఉద్యోగుల జేఏసీ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అరగంట పాటు చర్చించారు. పీఆర్సీ ప్రకటన, పెండింగ్ డీఏ విడుదల, ఈహెచ్ఎస్ అమలు, ఉద్యోగ సంఘాలకు ఓడీ సౌకర్యంపై చర్చించారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న ఉద్యోగ సంఘాల నాయకులు, 3 డీఏల విడుదలపై అసెంబ్లీ సమావేశాల్లోనే ఉత్తర్వులివ్వాలని కోరారు. రెండే కదా అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కొద్దిరోజుల్లో రెండు డీఏల విడుదల పక్కా అని సీఎం మాటలను బట్టి అర్థమైందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలో దసరా పెద్ద పండుగ అని, అప్పటి నుంచే పీఆర్సీ అమలయ్యేలా చూడాలని కోరగా రంజాన్ కూడా పెద్ద పండుగే కదా అని సీఎం నవ్వుతూ అన్నట్లు సమాచారం. పెండింగ్ బిల్లుల కోసం నెలకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరగా, గత జనవరి నుంచి రూ.10 వేల కోట్లు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. ఉద్యోగ సంఘాలకు సంబంధించి ఈ ఏడాదికి ఓడీ సౌకర్యం ఇంకా పెండింగ్‌లో ఉందని చెప్పగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

## బొల్లారం బండారం బట్టబయలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్‌ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం సీఎం డైరెక్షన్‌లోనే జరిగాయన్నారు.

# పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

(మొదటి పేజీ తరువాయి)

నిజాయితీగా వివరాలందించిన కాలేజీల రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారిగా చెల్లిస్తామని చెప్పారు. ప్రజాప్రభుత్వం విద్యా రంగానికి ఎందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందో సభ లో వివరించిన ముఖ్యమంత్రి సభ్యులు లేవనెత్తిన అంశాలకు సూటిగా సమాధానమిచ్చారు. ముఖ్యం గా పాలిటెక్నిక్ కళాశాలలను విద్యాశాఖ పరిధి నుం చి స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీయడానికి కాదని, వారిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసం ధానించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందు కేనని తెలిపారు.ఈ విషయంలో ఇప్పటికీ అనుమా నాలుంటే సభ్యులు, నిపుణులు ఇచ్చే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు, చర్యలు చేపట్టి సరిదిద్దుకోవడానికి ప్రభు త్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. "విద్య ఒక్కటే మన జీవితాల్లో వెలుగును తీసుకొస్తుంది" అనే సం పూర్ణ విశ్వాసంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. సామాజిక వెనుకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులు కాకుండా విద్య లేకపోవడమే ప్రధాన కారణమని ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో తేలిన విషయాన్ని ఈ సందర్భంగా ప్ర స్తావించారు. "తెలంగాణకు నూతన విద్యా విధా నాన్ని రూపొందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పా టు చేశాం. కమిషన్ సమర్పించిన నివేదికను పరిశీ లించేందుకు కే కేశవరావు గారి నేతృత్వంలో కమిటీ ని నియమించాం. సభ్యులు, విద్యా రంగ నిపుణులు ఎవరైనా తమ సూచనలు, సలహాలను కమిటీకి అం దిస్తే వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విద్యాశాఖను ముఖ్యమంత్రి స్వయంగా నిర్వ హించడం ఆ శాఖకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్య తకు నిదర్శనం. తాను విద్యాశాఖపై ఒక తపనతో పనిచేస్తున్నా. ముఖ్యమంత్రి హోదాలో విద్యాశాఖను సమీక్షిస్తే మొత్తం వ్యవస్థపై సమగ్ర సమీక్ష జరుగుతుంది. 2023-24లో గత ప్రభుత్వం విద్యాశాఖకు రూ.19,093 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2024-25లో రూ.21,292 కోట్లు కేటాయించాం. 2025-26లో రూ.23,108 కోట్ల కు, 2026-27లో రూ.26,647 కోట్లకు పెంచాం. కేవలం మూడేళ్లలోనే విద్యాశాఖ బడ్జెట్‌ను రూ. 7,554 కోట్ల మేర పెంచాం" అని ముఖ్యమంత్రి గారు సభ ముందు వివరించారు. "తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కేవలం 55 రోజుల్లో 10,006 మంది ఉపాధ్యాయుల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశాం. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7,857 మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించింది" అని పేర్కొన్నారు. "జెన్ జీ ఒక్కటే కాదు. రానున్న జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాలను దృష్టిలో ఉంచుకుని నూతన విద్యా విధానాన్ని రూపొందిస్తున్నాం. "దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది.. తలరాతలను మార్చేది విద్య" అనే నమ్మకంతోనే విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నా. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తెలంగాణకు తీసుకొ చ్చేందుకు, దేశానికి తెలంగాణను ఒక రోల్‌మోడల్ గా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం" అని అన్నారు. "విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మేర పెరిగిందని సీఎం తెలిపారు. ఇది తన పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో రెండున్నరేళ్లకే పిల్లలను చేర్చుకుంటుండగా, ప్రభు త్వ విద్యా వ్యవస్థలో ఐదేళ్ల వయసు వరకు వేచి చూ డాల్సిన పరిస్థితి ఉంది. నర్సరీ, ఎల్‌కేజీతో పాటు ఇం గ్లిష్ మీడియం కోసం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశా లల వైపు వెళ్తున్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాల ల్లో తొలిసారిగా ప్రీ-ప్రైమరీ విధానాన్ని ప్రారంభించాం. ఈ ఏడాది 64 వేల మంది విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ విద్య అందిస్తున్నాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా నాణ్యమైన, పరిశుభ్రమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం. విద్యార్థులకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాం" అని వివరించారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానించడమే పాలిటెక్నిక్‌లను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వె నుక ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి గారు వివ రించారు. రాష్ట్రంలోని 59 పాలిటెక్నిక్ లను టాటా టెక్నాలజీ సంస్థ సహకారంతో రూ.4వేల కోట్లతో ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్ షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకా శాలను పెంచడమే లక్ష్యమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో కోర్సులను ఆధునీకరిస్తామని చెప్పారు.సాంకేతిక విద్య-నైపుణ్యాభివృద్ధి విభాగాల అనుసంధానంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబ్‌లు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం పైనా ముఖ్యమంత్రి సభలో స్పష్టత ఇచ్చారు. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.5,435 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వదిలివెళ్లిందని తె లిపారు. అందులో గత ప్రభుత్వం పెట్టిన బకాయిల నుంచి రూ.1,410 కోట్లు తమ ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు.

## చట్ట సవరణతో పల్లెల బలోపేతం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):

పంచాయతీరాజ్ చట్ట సవరణతో గ్రామాల అభివృద్ధికి మరింత దారి సుగమమైందని మహిళా సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటుపల్లి రేణుక అన్నారు. గ్రామ పంచాయతీలకు, సర్పంచులకు పూర్తి అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణను మహిళా సర్పంచుల ఫోరం స్వాగతిస్తోందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి రేణుక హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలకు పూర్తి అధికారాలు కల్పించడం గ్రామస్వరాజ్య స్ఫూర్తికి నిజమైన అర్థం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పంచాయతీలకు అధికారాలు పెరగడంతో స్థానిక సమస్యలను సర్పంచులు మరింత సమర్థవంతంగా పరిష్కరించగలరని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయడానికి అవకాశం ఏర్పడుతుందని రేణుక అన్నారు. ముఖ్యంగా మహిళా సర్పంచులకు ఈ నిర్ణయం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని, స్థానిక పాలనలో వారి పాత్రను బలోపేతం చేస్తుందని చెప్పారు. సర్పంచుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని వారి గళానికి ప్రాధాన్యం ఇచ్చినందుకు మంత్రి సీతక్కను రేణుక అభినందించారు. చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు మహిళా సర్పంచుల ఫోరం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీలకు అధికారాల వికేంద్రీకరణ దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని రేణుక కోరారు. రాబోయే రోజుల్లో నిధుల కేటాయింపుతో పాటు పరిపాలనా వ్యవహారాల్లోనూ సర్పంచులకు మరింత స్వేచ్ఛ, అధికారాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ రాజ్యంలో గజానికో గజదొంగ

(మొదటి పేజీ తరువాయి)

నెట్టి సమాంతర రెవెన్యూ వ్యవస్థను నడుపుతోందని విమర్శించారు. "రాష్ట్రంలో గజానికో గజదొంగ తయారయ్యారు. మంత్రుల తీరు అలీబాబా అరడజన్ దొంగల్లా మారింది. 'తమ్ముడూ లెట్స్ డూ కుమ్ముడు' అన్నట్లు ముఖ్యమంత్రి సోదరులు రాష్ట్ర సంపదను పిండేస్తున్నారు" అని కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. వీరప్పన్ అటవీశాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, ఆర్టీఐ బ్లాక్‌మెయిలర్ సీఎం అయితే పాలన అలాగే తయారైందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల ముసుగులో రూ. 200 కోట్ల విలువైన భూములను రూ.7కోట్లకే దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అంతర్జాతీయ సంస్థలకు లేఖలు రాస్తామని హెచ్చరించారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, నిషేధిత భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్ వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్దఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆరఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆరఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు. . ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం, బడా బాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వారు, అదే జాబితాలో నానా ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజల భూములు ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని సూటిగా నిలదీశారు. తక్షణమే పేదల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆరఎస్ పార్టీ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# 12.91 లక్షల మందికి ఉచిత ప్రమాద బీమా

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ఉద్యోగులపై, ప్రభుత్వ ఖజానాపై ఒక్క రూపాయి భారం లేకుండా రూ.కోటి వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వెల్లడించారు. బ్యాంకుల ద్వారా ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు చెల్లిస్తున్న నేపథ్యంలో 16 ప్రముఖ బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఆర్థిక శాఖ జీవో నంబర్ 77 ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణించిన సందర్భంలో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవితకాల భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఇప్పటివరకు 89 ఉద్యోగ కుటుంబాలకు పరిహారం అందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు 50, విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీజెన్‌కో ఉద్యోగుల కుటుంబాలు 15, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కుటుంబాలు 24 ఉన్నాయని వివరించారు. విమాన ప్రమాదంలో మరణిస్తే బ్యాంకులు అందించే శాలరీ, పెన్షన్ ఖాతా ప్యాకేజీల ఆధారంగా రూ.2.20 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా కవరేజీ లభిస్తుందని తెలిపారు. కొన్ని కేటగిరీల్లో సాధారణ ప్రమాద మరణానికీ రూ.1.50 కోట్లకు పైగా బీమా ప్రయోజనం అందుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 12,91,046 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఈ పథకం వర్తిస్తుందని భట్టి తెలిపారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ సిబ్బంది, 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది, 2,72,615 మంది పెన్షనర్లు ఉన్నారని వివరించారు. తొలుత 2024 ఫిబ్రవరిలో సింగరేణి ఉద్యోగులకు, అదే ఏడాది జూన్‌లో విద్యుత్ శాఖ సిబ్బందికి ఈ పథకాన్ని ప్రారంభించామని, ప్రస్తుతం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలకూ విస్తరించామని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం సమర్థంగా అమలయ్యేలా ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులను అందులో భాగస్వాములను చేశామని చెప్పారు. ఈహెచ్ఎస్ ట్రస్ట్ ఖాతాలో ఆర్థిక శాఖ నుంచి రూ.264 కోట్ల కార్పస్ ఫండ్‌ను జమ చేసినట్లు తెలిపారు. ఎదురయ్యే సమస్యలను ఉద్యోగ సంఘాల నాయకులు, ట్రస్టీలు చర్చించి పరిష్కరించుకునేలా వ్యవస్థను ఏర్పాటు చెప్పారు.

## మోటార్లకు మీటర్లు పెట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూ చించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసర ముందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని 29లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభు త్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారు లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చు వుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసి న గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్?) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

## అటవీ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య):

అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రాణాలను పణంగా పెడుతున్న అటవీ సిబ్బంది భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అటవీ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని స్మారక చిహ్నం వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్‌కుమార్, అధికారులు, అటవీ సిబ్బంది పుష్పాంజలి ఘటించి అమరవీరులకు నివాళులర్పించారు. వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన చెరువుసింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ కుటుంబానికి మంత్రి రూ.30 లక్షల చెక్కును అందజేశారు. ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అటవీ శాఖను మరింత బలోపేతం చేసేందుకు 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, 15 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 18 అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌తో పాటు ఇతర కేటగిరీల్లో మొత్తం 1,516 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అనుమతించిందని జూపల్లి తెలిపారు. నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అటవీ నేరాలు, కలప అక్రమ రవాణా, ఆక్రమణలు, వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 2014 నుంచి 2026 జూలై వరకు 1,06,685 అటవీ నేర కేసులు నమోదయ్యాయని, రూ.55.99 కోట్ల విలువైన కలపకు సంబంధించిన కేసుల్లో రూ.160.75 కోట్ల కంపౌండింగ్ ఫీజు వసూలు చేసినట్లు వివరించారు. ఈ కేసులకు సంబంధించి 19,482 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదనంగా 31,523 గుర్తించలేని అటవీ నేర కేసులు నమోదు చేసి రూ.70.72 కోట్ల విలువైన కలపను స్వాధీనం చేసుకుని డిపోలకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. 11,824 అటవీ ఆక్రమణ కేసులు నమోదయ్యాయన్నారు.

### ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ఆయుధాలు

అటవీ రక్షణ విధుల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ఆయుధాలు, మందుగుండు సామగ్రి అందించేందుకు రూ.4.095 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు జూపల్లి చెప్పారు. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అటవీ ఆక్రమణలు, కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట వంటి వ్యవస్థీకృత నేరాలను అరికట్టడంతో పాటు సిబ్బంది వ్యక్తిగత భద్రతకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ, వాహనాలు, సాంకేతిక సదుపాయాలను కూడా మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు అందించే అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

## ఓవర్సీస్ విద్యానిధికి రూ.179.90 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

కింద రూ.179.90 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నిధులు విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. తాజా విడుదలతో విదేశాల్లో చదువుతున్న 3,008 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎస్సీ వర్గానికి చెందిన 1,193 మంది విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.48.42 కోట్లు, ఎస్టీ వర్గానికి చెందిన 573 మందికి రూ.36.95 కోట్లు విడుదలయ్యాయి.



# రంగారెడ్డి




## మట్టి వినాయకులనే ప్రతిష్టిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### జాతీయ చేనేత అధ్యక్షులు - డాక్టర్ చిక్క దేవదాసు

### పద్మశాలి సంఘం అధ్యక్షులు - మంద జగన్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 11(వార్త వేదిక సూర్య)

వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, సికింద్రాబాద్ ఎస్సి, ఎస్టి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మంద జగన్ తెలిపారు. ఈ సందర్భంగా వినాయక చవితి సందర్భంగా బౌద్ధనగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చిక్క దేవదాసు మాట్లాడుతూ..సాంప్రదాయబద్ధంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన తెలిపారు. మట్టి విగ్రహాలు నీటిలో సహజంగా కలిసిపోవడం వల్ల చెరువులు, కుంటలు, నదులు కలుషితం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ చింతకింది మల్లేష్, బొమ్మ నరేందర్. వైట్ల వెంకటాద్రి, చిదురాల శ్రీనివాస్, తౌటం సతీష్, దిండిగల శ్రీకాంత్, మంద ఈశ్వర్, ఒగ్గు శ్రీధర్, మంద మురళి, గబ్బెట రాజు , చింతగింది సాయికిరణ్, రామంచ రామకృష్ణ, వనమాల శ్రీనివాస్, దాస్ కరుణాకర్, కర్నాటి ఆనంద్, తిరుమల రవి, తిరుమల సంతోష్, జిల్లాపు వల్లపు కృష్ణమూర్తి, మంద పాపయ్య, ఆమంచ వెంకటేష్, వైట్ల రాము, సామల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కల్వచర్ల 9,10 వార్డులలో కోతుల బెడద

### సర్పంచ్ కు మహిళలు వినతి పత్రం

రామగిరి,సెప్టెంబర్ -11 ( వార్త వేదిక సూర్య )



కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని 9 మరియు 10వ వార్డులలో గత కొన్ని నెలలుగా కోతుల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా వార్డులకు చెందిన మహిళలు గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి కి వినతిపత్రం అందజేశారు.ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కోతులు గుంపులుగా ఇళ్లలోకి,వంట గదుల్లోకి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు.దీంతో చిన్నపిల్లలు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని,పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కావున వెంటనే స్పందించి సంబంధిత అటవీ శాఖ అధికారులతో మాట్లాడి కోతులను పట్టించి వేరే ప్రాంతానికి తరలించాలని,తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.లేని పక్షంలో వార్డు ప్రజలందరితో కలిసి నిరసనకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో 9,10 వార్డు సభ్యులు రేండ్ల కుమారస్వామి,చిందం కవితలతో పాటు మహిళలు కె.రమాదేవి,సిహెచ్.రమాదేవి, సిహెచ్.శిరీష,ఎన్.రాజేశ్వరి,డి.సాత్విక,బి. సమత, సిహెచ్.రాణి తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేట్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### డివిజన్ అధ్యక్షుడిగా దుర్గేష్ యాదవ్‌కు బాధ్యతలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



కోకాపేట్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా కార్యకర్తలు పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సూచించారు. కోకాపేట్ మాజీ కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియ మించిన సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే బాధ్యతను దుర్గేష్ యాదవ్ సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దుర్గేష్ యాదవ్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి : ఎమ్మెల్యే - పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 11(వార్త వేదిక సూర్య)

పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను కల్పించాల్సి ఉందని, ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమని గుర్తించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లో చేపట్టిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం సితాఫలమండీ లోని తన క్యాంపు కార్యాలయంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పర్యావరణ అనుకూల విధానాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతోందని అన్నారు. మట్టి వినాయకులను వినియోగించడం పర్యావరణానికి అవసరమని అన్నారు. బల్దియా అధికార యంత్రాంగం తాయారు చేయించి అందించడం ఆనందకరమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామల హేమ, బెజ్జంకి రాజేష్, శైలేందర్ బాబురావు,అశ్విన్, కృష్ణ జహంగీర్, రైమాన్ ,హాజగర్, జియా, పవిత్ర, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల కమిటీ నిర్వాహకులతో సమావేశం

### సబ్ ఇన్స్పెక్టర్ టి.శ్రీనివాస్



రామగిరి,సెప్టెంబర్ -11 ( వార్త వేదిక సూర్య )

రామగిరి సబ్ ఇన్ స్పెక్టర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భద్రతా చర్యలపై నిర్వాహకులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.గణేష్ ఉత్సవాల భద్రత అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా రామగిరి మండల ఎంఆర్ఓ సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో,భద్రతా నియమాలు పాటిస్తూ నిర్వహించుకోవాలని రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులకు,నిర్వాహకులకు సూచించారు.

ఈ సందర్భంగా ముఖ్యమైన భద్రతా మార్గదర్శకాలు తెలియ చేశారు.

మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీస్ శాఖ మరియు సంబంధిత అధికారుల నుండి అధికారిక అనుమతులు పొందాలి. మండపాల్లో నాణ్యమైన విద్యుత్ వైరింగ్ మాత్రమే ఉపయోగించాలి.షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు,ప్రమాదాలు జరిగితే ఎదుర్కొనేందుకు వీలుగా ప్రతి మండపం వద్ద నీరు,ఇసుక మరియు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి.రాత్రి వేళల్లో మరియు నిర్ణీత సమయం దాటిన తర్వాత మైకులు,డిజెలు వాడకూడదు.శబ్ద కాలుష్యం లేకుండా నిబంధనల పరిధిలోనే సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగించాలి,విగ్రహ నిమజ్జనం రోజున ఎలాంటి ఘర్షణలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా,నిర్ణయించిన మార్గాల్లో మాత్రమే ఊరేగింపును నిర్వహించాలి. ఎలాంటి అపశ్రుతులకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలి,ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో,పోలీసులకు సహకరిస్తూ పండుగను జరుపుకోవాలని ఎస్సై టి.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు,ఉప సర్పంచ్లు,మండల అధికారులు,ప్రజ ప్రతినిధులు వినాయక కమిటీ మెంబెర్స్, యువకులు పాల్గొన్నారు.

## మాపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం



### మంథని మార్కెట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, సెప్టెంబర్-11( వార్త వేదిక సూర్య )

మంథని మున్సిపల్ మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యానికి తమ కుటుంబమే కారణమంటూ కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మండిపడ్డారు. మార్కెట్ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులు, ప్రజలకు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంథని అభివృద్ధిని కోరుకునే రాజకీయ పార్టీల్లో బీజేపీ ముందుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలు, మంథని మున్సిపాలిటీకి వస్తున్న నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు తమ పార్టీ ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు. మంథని మార్కెట్ అభివృద్ధికి తమ కుటుంబం ఎప్పటి నుంచో సహకరిస్తోందని, చందుపట్ల రామ్‌రెడ్డి హయాంలోనే మార్కెట్‌కు పునాదులు పడ్డాయని గుర్తుచేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో మార్కెట్ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు, ప్రభుత్వానికి బీజేపీ తరఫున నిరంతరం సూచనలు చేస్తున్నామని తెలిపారు. మంథని అభివృద్ధి చెందకూడదనే ఉద్దేశంతో అసూయ, ద్వేషాలతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై కాకుండా వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం దిగజారుడు చర్య అని అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిత్వమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాసేవలో తమ కుటుంబానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, గత 15 ఏళ్లుగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నామని సునీల్‌రెడ్డి తెలిపారు. ప్రజల కోసం తమ కుటుంబం స్వంత భూములను ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వొజ్జల మురళీకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఎడ్ల సాగర్, ఉపాధ్యక్షులు బొల్లంపల్లి లక్ష్మణ్, ఆ ఇంటి మల్లేష్, కార్యదర్శి పార్వతి విష్ణు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గుడ్లగురవేష్, మండల ఉపాధ్యక్షుడు ఎల్లవేణి సమ్మయ్య, నాయకులు చందు, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల వేతనాలు తగ్గిస్తే సహించం

### - పర్మినెంట్ చేయాలి.. రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి

### - సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తాం: మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :

రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ సంఘం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు సుధాకర్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కే.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పి.శివబాబు ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రిషియన్ లైన్మెన్లు, డ్రైవర్లు, వాటర్‌మెన్లు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య కార్మికులు, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, ఎన్ఎంఆర్ తదితర కార్మికుల వేతనాలను తగ్గించడం కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే నిర్ణయమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమలవుతున్న వేతనాలను కొనసాగించాలని, ఎన్ఎంఆర్ కార్మికులకు కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలో విలీనమైన 27 మున్సిపాలి టీల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా జీహెచ్ఎంసీ వేతనాలు అమలు చేయాలని కోరారు.మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.10 లక్షలు ఇవ్వాలని, మరణించిన లేదా 60 సంవత్సరాల వయోపరిమితి పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్మికులందరికీ ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించ కపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనిపై మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పందిస్తూ మున్సిపల్ కార్మికుల సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. త్వరలో కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చించేలా తగిన చర్యలు తీసుకుంటామని సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.మద్దిలేటి, టియుసిఐ రాష్ట్ర నాయకులు ఎస్.కిరణ్, నర్రా గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం : ఎంఈఓ దాసరి లక్ష్మి

మంథని, సెప్టెంబర్ -11 (వార్త వేదిక సూర్య)



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్, ప్రైవేటు సంస్థలు మరియు కార్యాలయ సిబ్బంది తదితర విభాగాలలో మొత్తం 25 మందికి ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. మంథని మండల విద్యాధికారిణి దాసరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, రెండవ వార్డ్ కౌన్సిలర్ నూకల కమల్, పాక్స్ పర్సన్ ఇంచార్జ్ కొత్త శ్రీనివాస్, రోడ్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ జిల్లా సభ్యులు మంథని సురేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శ్రీజ రెడ్డి, ముత్తారం మండల విద్యాధికారి హరి ప్రసాద్, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, ఈదులపల్లి నరసింహారావు, ఆర్ రమేష్ లువిచ్చేసి ఉత్తమ ఉపాధ్యాయూలకు పురస్కారాలను అందజేసి పురస్కార గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా మంథని మునిసిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ భావి పౌరులను నిర్మించే గురుతరమైన బాధ్యతను కలిగిన ఉపాధ్యాయులు సమాజంలో ఉన్నతమైన పాత్రను పోషిస్తున్నారని, ఇకముందు కూడా పోషించాలని, తద్వారా సమాజమంతా బాగుపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పెద్దపీట వేస్తున్నదని, విద్యారంగంలోని అన్ని కార్యక్రమాలను శరవేగంగా ముందుకు తీసుకెళుతున్నదని అన్నారు. వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అంతా ఉపాధ్యాయుల చేతుల్లోనే నిర్మాణం అవుతుందని, ఒక దేశాన్ని ఉన్నతంగా మార్చాలంటే ఆ బాధ్యత అంతా గురువులపైనే ఉంటుందని, కాబట్టి ఉపాధ్యాయుల పాత్ర ఎన్నటికీ మరువ లేనిదని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీజా రెడ్డి మాట్లాడుతూ ఎన్ని వృత్తులు నిర్వహించనూ వాటన్నింటిలోకి అతి పవిత్రమైన, అత్యున్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, అలాంటి ఉపాధ్యాయులను స్మరించుకోవడం ఆనందదాయకమని అన్నారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి పోస్టల్ నూతన ఎస్పీగా అంబేద్కర్ రాజు

సంగారెడ్డి, వార్త వేదిక సూర్య ప్రతినిధి సెప్టెంబర్ 11:

సంగారెడ్డి తపాలా డివిజన్ నూతన ఎస్పీగా బి. అంబేద్కర్ రాజు శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పోస్టల్ ఎస్పీగా పనిచేసిన డి.శ్రీహరి హైదరాబాద్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బి.అంబేద్కర్ రాజు సంగారెడ్డి డివిజన్ తపాల ఎస్పీగా బదిలీ పైన వచ్చి జాయిన్ అయినారు.

## ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్-11 (వార్త వేదిక సూర్య )



ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను జిల్లాలో ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా సద్వినియోగం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధుల వినియోగంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను ఎంత మేరకు, ఏయే రంగాల్లో సమర్థవంతంగా వినియోగించవచ్చనే అంశంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు అందుబాటులో ఉన్న ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను సద్వినియోగం చేసేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యా రంగం, వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. లిఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతలి ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటి అభివృద్ధికి సీఎస్ఆర్--సీడీ నిధులను వినియోగించేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

నిధులను సమర్థవంతంగా వినియోగించాలిలి

ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులు వృథా కాకుండా, నిబంధనలకు అనుగుణంగా అత్యంత సమర్థవంతంగా వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు చేపట్టగల పనులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి తదుపరి చర్యలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లాలో సీఎస్ఆర్--సీడీ నిధుల ద్వారా చేపట్టే పనులు ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, సీపీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ సర్కిల్ -- హైదర్‌గూడ 113 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సామ ఇంద్రపాల్ రెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ 113వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన సామ ఇంద్రపాల్ రెడ్డిని నియమించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వుల ప్రతిని ఇంద్రపాల్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఫహీం ఖురేషీతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు సామ ఇంద్రపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం: బీఆర్ఎస్ నేత శ్రీధర్ సాగర్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :

భవన నిర్మాణ కార్మికులకు ఏ సమస్య వచ్చినా వారి తరఫున నిలబడి పోరాడుతానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ సాగర్ హామీ ఇచ్చారు. గుడి మల్కాపూర్‌లోని ఎస్బీఐ కమ్యూనిటీ హాల్‌లో 'శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు.

?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర కీలకమైనదని, వారి సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్మికుల ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వారి సంక్షేమ పథకాల అమలు మరియు బాగోగులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ?ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 115
శనివారం
12 సెప్టెంబర్ 2026



## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :
పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు శ్రీరామ కాలనీలోని కోటి విద్య స్కూల్ ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రసాయనాలతో తయారు చేసిన గణపతి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల వాటిలోని హానికరమైన రసాయనాలు నీటిలో కలిసే అవకాశం ఉందన్నారు. దీంతో జలచరాలకు, నీటిని వినియోగించే ప్రజలకు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని వివరించారు. మట్టి గణపతులను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని, జల వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులుసూచించారు. ప్రతి ఇంట్లో మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ హిత వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ షాక్‌కు గురైన బాలుడికి ఉచిత వైద్యం

**- చికిత్సకు వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇప్పించిన జిల్లా వైద్యాధికారి**

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



విద్యుత్ షాక్‌కు గురైన ప్రభుత్వ ఉద్యోగి కుమారుడికి ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ఉచితంగా మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆసుపత్రి యాజమాన్యం కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేసిన చికిత్స ఖర్చులను తిరిగి ఇప్పించినట్లు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణకుమారి తెలిపారు. బాధిత బాలుడిని ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ఆసుపత్రిలో చేర్పించి, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అవసరమైన వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిధిలోకి వచ్చే వైద్య సేవలను అందించడంలో నిర్లక్ష్యం చేసే లేదా రోగుల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డా. స్వర్ణకుమారి హెచ్చరించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలను అర్హులైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



చేయూత పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 15, 2026 వరకు గడువు ఉన్నందున అర్హత కలిగిన వారు గడువులోగా దరఖాస్తులు సమర్పించా లని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అర్హులు సంబంధిత మండల కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారు సంబంధిత మున్సిపల్ కార్యాలయాలు, జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించు కుని సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

## అమావాస్య అన్నదనానికి విశేష స్పందన.

కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య) :



కూకట్ పల్లి జోన్, ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని దీనబంధు కాలనీ లోగల అమ్మవారి ఆలయంలో దాతల సహకారంతో స్థానిక సీనియర్ నేత వెంకటేశ్వర శెట్టి ఆధ్వర్యంలో అమావాస్య కు నిర్వహిస్తున్న అన్నదానానికి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం ఆషాఢ మాసం అమావాస్యను పురస్కరించుకొని నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి దేవ భూషనమ్, మీస వెంకటయ్య చిరంజీవి మంగలి బస్వరాజు, చెరన్ చిన్నారావు, శేషు, అనీల్, శ్రీహరి, రేణు కుమార్, శ్రీను మహేష్ ఎం.శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ పాటించాలి**

**మొయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్**



మొయినాబాద్ మున్సిపాలిటీ సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య)
మండల పరిధిలోని చిలుకూరు మున్సిపాలిటీ గల కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో
పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం మరియు వినాయక చతుర్థిని పర్యావరణహితంగా జరుపుకోవడంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో, కేజీ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మొయినాబాద్ పోలీసుల సహకారంతో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సమీపంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా భక్తులకు, స్థానిక ప్రజలకు 1,500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్
( పిఓపి ) విగ్రహాలను నివారించి, జలవనరుల కాలుష్యాన్ని తగ్గించడంలో తోడ్పడే పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాల్సిన ప్రాముఖ్యతను ఎంతైనా ఉందని అన్నారు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగురాజు ,మొయినాబాద్ మల్లికార్జున్ రెడ్డి సర్కిల్ ఇన్ స్పెక్టర్ , సబ్ ఇన్ స్పెక్టర్ (వెంకన్న ), స్థానిక ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు దా రెడ్డి వెంకట్ రెడ్డి , కేతిరెడ్డిపల్లి సర్పంచ్ యాదయ్య, రాజకీయ నాయకులు హాజరయ్యారు. కేజీ రెడ్డి కాలేజ్ స్టూడెంట్ అఫైర్స్ ( డీ ఎస్ ఎ) డీన్ శ్రీ రత్నాచారి మరియు విద్యార్థి వాలంటీర్లు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విగ్రహాల పంపిణీకి సహకరించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులను మరియు సమాజాన్ని పర్యావరణ పరిరక్షణ బాధ్యతను స్వీకరించేలా ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజల నుండి విశేష స్పందన పొందిన ఈ కార్యక్రమం, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ మరియు సమాజ భాగస్వామ్యం పట్ల కేజీ రెడ్డి కాలేజీకి ఉన్న కట్టుబడిని నిరూపించింది.

# 22ఏలో చేర్చిన భూములను విడిపించాలి

**కేపీహెచ్‌బీ, వసంత్‌నగర్--సర్దార్ పటేల్‌నగర్ కాలనీ అసోసియేషన్ల డిమాండ్.**

**సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.**



కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య) :
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్ తదితర కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు తమ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆస్తులను 22ఏ నుంచి తొలగించి, భూములను ప్రభుత్వం విడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసుకున్న భూములను 22ఏ జాబితాలో చేర్చడంతో తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజల ఆస్తులకు కూడా భద్రత లేకుండా పోయిందని, ప్రజల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. 22ఏ సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
కూకట్‌పల్లి నియోజకవర్గమంతా సమస్యను పరిష్కరించాలి
ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో 22ఏ జాబితాలో చేర్చిన ప్రజల భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గానికే పరిమితమైన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి 22ఏలో చేర్చిన భూములపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తుల పరిరక్షణ కోసం అవసరమైన స్థాయిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్‌రెడ్డి, పగడాల శిరీష్ బాబూరావు, సబిహా గౌసుద్దీన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :
నర్కుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పాఠశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యుల చేత ప్రత్యేకంగా యూనిఫామ్‌లను కుట్టించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ పంచాయతీ తరఫున పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, వార్డు సభ్యులు చౌట రాజు, నాయకులు తొంట అశోక్, లింగం నవీన్, కుంచ రక్షిత్, ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధ్యక్షులు బాబు రావు, వీఓలు యాదమ్మ, లావణ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం

భూపాలపల్లి, సెప్టెంబర్ -11 ( వార్త వేదిక సూర్య )
తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ అవగాహన కార్యక్రమాన్ని 2026, సెప్టెంబర్ 11 న భూపాలపల్లి జిల్లా అటవీ కార్యాలయంలో నిర్వహించారు.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా నోడల్ అధికారి, ఏఈఎస్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జిల్లా అటవీ అధికారి జి. కిష్టా గౌడ్ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా డీఎఫ్ఓ జి. కిష్టా గౌడ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ,



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రజలకు, సిబ్బందికి సుమారు 400 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలకొండ ఎఫ్డీఓ, సృజన ఎఫ్ఆర్ఓ కుమారి,భూపాలపల్లి అటవీ శాఖ అధికారులు, టీజీపీసీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్ర.. ట్యాంక్‌బండ్‌పై సీపీఐ ర్యాలీ

రాజేంద్రనగర్ , సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :
తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్రలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ర్యాలీ నిర్వహించారు. కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఈటీ నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనం జైపాల్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శి కామ్రేడ్ స్టాలిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, శంషాబాద్ సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ నరగిరి, బాలాపూర్ మండల సీపీఐ నాయకులు కామ్రేడ్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 11(వార్త వేదిక సూర్య)
సెప్టెంబర్ 5న భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని కీసర మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర మండల ఎంఈఓ వెంకటరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, జమదగ్ని తదితరులను సన్మానించారు. అలాగే కీసరలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రవిచంద్రశేఖర్, ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్ను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి), ఎస్టీయు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బద్దె వెంకటేశ్వర్లు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, మండల బాధ్యులు యాదగిరి, శ్రీనివాస్, యుటిఎఫ్ బాధ్యులు కరుణాకర్, ఎస్టియు మండల బాధ్యులు సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ

## అంజయ్యనగర్‌లో కిలో గంజాయి పట్టివేత.

**కూకట్‌పల్లి ఎక్సైజ్ పరిధిలో ఎస్టీఎఫ్ బృందం తనిఖీలు**

**మహిళపై కేసు నమోదు.**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య) :
కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్టీఎఫ్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న ఓ మహిళ వద్ద నుంచి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో కుదినేత సోని అనే మహిళ వద్ద గంజాయి గుర్తించడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి పట్టివేతలో సీఐ రమేష్‌తో పాటు ఎస్సై మధు, హెడ్ కానిస్టేబుల్ సంతోష్ ప్రసాద్, కానిస్టేబుళ్లు రవి, రాహుల్, రాజేశ్వరి, ఖలీద్ పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితురాలిని కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ రమేష్ తెలిపారు. గంజాయి అక్రమ విక్రయాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## ట్రాఫిక్ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం

**సిబ్బందికి రక్షణ సామగ్రి కిట్ల పంపిణీ**

**ట్రాఫిక్ సిబ్బంది భద్రత, సంక్షేమం కూడా అత్యంత ముఖ్యం : ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ**

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :
ఫీల్డ్ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది భద్రత, సంసిద్ధతతో పాటు సమర్థవంతమైన విధుల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన రక్షణ సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అధిక ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కిట్లలో వర్షపు కోట్లు, ప్రతిబింబించే జాకెట్లు, హెల్మెట్లు, చేతి బాటన్లు, జంగిల్ షూస్, వర్షపు షూస్, కళ్లద్దాలు, నీటి సీసాలు, బ్యాగులు, చేతి గ్లౌజులు ఉన్నాయి. ఈ సందర్భంగా డీసీపీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిబ్బంది వివిధ వాతావరణ పరిస్థితుల్లో ఎక్కువ సమయం రోడ్లపై విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతతో పాటు ట్రాఫిక్ సిబ్బంది భద్రత, సంక్షేమం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.
సరైన రక్షణ సామగ్రి అందుబాటులో ఉండటం వల్ల ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సిబ్బంది మరింత భద్రతతో, స్పష్టమైన దృశ్యమానతతో, ధైర్యంగా విధులు నిర్వహించగలరని తెలిపారు. విధుల సమయంలో రక్షణ సామగ్రిని సక్రమంగా వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించడంపై నిరంతరం దృష్టి సారించాలని ఆదేశించారు.

## దాడులు చేసిన అధికారులకు సన్మానాలా?

**- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ విపక్షాలపై దౌర్జన్యం: సబితా ఇంద్రారెడ్డి**

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



తనపై, తన అనుచరులపై భౌతిక దాడికి పాల్పడిన పోలీసు అధికారులను ప్రభుత్వం ఘనంగా సన్మానించడంపై మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్షాలపై దౌర్జన్యానికి పాల్పడిన అధికారులను శిక్షించాల్సింది పోయి పురస్కారాలతో సత్కరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని ఆమె మండిపడ్డారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తమపై దాడి జరిగిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని అన్నారు. దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా, వారికి ప్రశంసలు, సన్మానాలు చేయడం ద్వారా ప్రభుత్వం సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తోందని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆ హక్కులను పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి: ఎస్పీ డి.జానకి**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( వార్తా వేదిక సూర్య ):



ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, వాహనం, కమిటీ సభ్యుల వివరాలను పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.
విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు, ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
పోలీస్ శాఖ, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని తెలిపారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 115
శనివారం
12 సెప్టెంబర్ 2026




## AIYF రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా చెన్నోజు వెంకటాచారి

నాంపల్లి సెప్టెంబర్ 11(వార్త వేదిక సూర్య):
నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లప్పరాజుపల్లి గ్రామం అభ్యర్థి అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా చెన్నోజు వెంకటాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు యువజన నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.
యువత సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని చెన్నోజు వెంకటాచారి తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా అవకాశం కల్పించిన ూౕఖీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యువతను సంఘటితం చేసి ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తానని పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన 12 వ బెటాలియన్ కమాండెంట్

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )



12 వ బెటాలియన్, అన్నేపర్తి కమాండెంట్ బి . రామకృష్ణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామకృష్ణ మంత్రికి పుష్పగుచ్ఛంతో పాటు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ..పోలీసు సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న డీఏలు, టీఏలు, సరెండర్ లీవ్ తదితర బకాయిలను అతి త్వరలో క్లియర్ చేయడం జరుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అలాగే పోలీసు సిబ్బందికి సంబంధించిన సమస్యలు, సంక్షేమ అంశాలను కమాండెంట్ రామకృష్ణ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిస్కరిస్తామని మంత్రి తెలిపారు.

## ఎన్నో రోజుల నిరీక్షణకు తెరపడింది

### కార్పొరేటర్ అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్ చొరవతో పూర్తయిన రోడ్డు పనులు

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )
నల్లగొండ పట్టణంలోని 42 వ డివిజన్‌లో ఎన్నో రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ ఆసుపత్రి సమీపం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పనులను సదరు కాంట్రాక్టర్ గత ఆరు నెలలుగా అసంపూర్తిగా వదిలేయడంతో ఆయా కాలనీల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించిన 42 వ డివిజన్ కార్పొరేటర్ అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేయాలని సూచించడంతో పాటు, శుక్రవారం స్వయంగా పనుల వద్ద ఉండి రోడ్డు పనులను దగ్గరుండి వేయించారు. దీంతో ఆరు నెలలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తికావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## బీసీ కులగణన కోసం ధర్మ పోరాట దీక్ష

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )
దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగణనలో బీసీల కులగణనను ప్రత్యేకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో బీసీల ధర్మ పోరాట దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ల కర్ణాకర్ యాదవ్ బీసీ సంఘం స్టూడెంట్ ప్రెసిడెంట్, నల్ల మధు యాదవ్ బీసీ సంఘం స్టూడెంట్ నల్గొండ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. బీసీ విద్యార్థుల పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, జనగణనలో ఓబీసీ కులానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి బీసీల జనాభాను ఖచ్చితంగా లెక్కించాలని కోరారు.
జనగణనలో మొత్తం 33 ప్రశ్నలతో కూడిన పత్రంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబాలు, ఆస్తులు, పశువులు తదితర అనేక వివరాలను లెక్కిస్తున్నప్పుడు, దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న ఓబీసీ కుటుంబాల కుల వివరాలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నిస్తున్నాం. బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితమైన గణాంకాలు లేకపోతే, జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో సరైన వాటా ఎలా నిర్ణయించగలరు ? కులగణన లేకపోవడం వల్ల బీసీలు సామాజిక, ఆర్థిక, విద్యా మరియు రాజకీయ రంగాల్లో మరింత వెనుకబడే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు.

# సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే




సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి
సిపిఐ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )
భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నైజాంను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తున్నదని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ నెల 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ నల్గొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధులకు, ప్రజా పోరాటంలో భాగస్వాములైన అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమం లో ముఖ్య అతిథిగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాటి నైజాం వ్యతిరేక పోరాటంలో బిజెపి పాత్రే లేదని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రం, ప్రభుత్వం కపట నాటకము ఆడుతున్నదని విమర్శించారు ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన పాలకులు ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. సెప్టెంబర్ 17 ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని, సాయుధ పోరాటానికి వారసులు ఒక్క కమ్యూనిస్టులేనని అన్నారు. భూస్వాములకు, దోపిడీ దారులకు నైజాం సర్కారు అండగా ఉండడం వల్లనే నైజాం సర్కారు పై సాయుధ పోరాటానికి సిపిఐ పిలుపునిచ్చిందన్నారు. ఆ పోరాటంలో తెలంగాణలో పది లక్షల ఎకరాల భూమి పంచబడిందని, వేల గ్రామాలను విముక్తి చేయడం జరిగిందని చెప్పారు. నాటి పోరాటంలో దొడ్డి కొమరయ్య మొదలుకొని నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, నేడు తెలంగాణలో గ్రామ గ్రామాన నాటి నెత్తుటి ఆనవాళ్ళు ఉన్నాయని అన్నారు. బీజేపీ కు తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి ,వి లెనిన్, ప్రద్యుమ్న రెడ్డి,పి ముత్యాలు, యూసుఫ్, నారాయణ, జి నరేందర్, పి వెంకన్న,అంజయ్య, సీతారాములు, జే విజయ, అరుణ ,కే వెంకటేశం,వీరయ్య, పి నరసింహ, శ్రీనివాస్ , చైతన్య, ముత్తయ్య,లింగయ్య, తదితరులు పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులు అర్పించారు

# మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బాధితుల ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలి

### కులాంతర వివాహితుల ప్రోత్సాహక నగదు బకాయిలను తక్షణమే చెల్లించాలి

### కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున



నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )
నల్లగొండ జిల్లాలో గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం (పి.ఓ.ఏ యాక్ట్) కింద నమోదైన 102 కేసులలో 180 మంది బాధితుల ఎక్స్‌గ్రేషియా, అలాగే కులాంతర వివాహం చేసుకున్న 250 జంటలకు ప్రభుత్వం అందించాల్సిన రెండున్నర లక్షల ప్రోత్సాహక నగదు వెంటనే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు.
ఈ డిమాండ్‌తో కేవీపీఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా డీఆర్వో దశరథ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలడుగు నాగార్జున మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా గత మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల కేసుల్లో బాధితులైన కుటుంబాలకు చట్ట ప్రకారం అందాల్సిన ప్రభుత్వ పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బాధిత కుటుంబాల్లో అత్యధికులు పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారేనని, వారికి సకాలంలో ఎక్స్‌గ్రేషియా అందకపోవడం వల్ల న్యాయం జరగడమే కాకుండా ఆర్థిక భారం కూడా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బాధితులకు అందాల్సిన పరిహారం మూడేళ్లుగా పెండింగ్**

ఎస్సీ, ఎస్టీ బాధితులకు చట్టం ప్రకారం వివిధ దశల్లో అందాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని నాగార్జున అన్నారు. ప్రభుత్వం తక్షణమే అవసరమైన నిధులను విడుదల చేసి, అర్హులైన ప్రతి బాధితుడికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కులాంతర వివాహితులకు ప్రోత్సాహక నగదు ఎప్పుడు ?**

కుల వ్యవస్థ నిర్మూలనకు, సామాజిక సమానత్వానికి కులాంతర వివాహాలు ఎంతో దోహదపడతాయని, అలాంటి వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం కూడా గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం బాధాకరమని అన్నారు.
ప్రోత్సాహక నగదు కోసం లబ్ధిదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సరైన సమాధానం లభించడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, అర్హులైన కులాంతర వివాహితుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

**అధికారుల నిర్లక్ష్యాన్ని విడనాడాలి**

నిధుల మంజూరులో జరుగుతున్న జాప్యం, సంబంధిత శాఖల సమన్వయ లోపం వల్ల వందలాది మంది లబ్ధిదారులు ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని నాగార్జున విమర్శించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

1. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ూజ, ూ బాధితుల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలి.
2. పి.ఓ.ఏ యాక్ట్ కింద నమోదైన కేసుల అర్హులైన బాధితులకు చట్ట ప్రకారం రావాల్సిన పరిహారాన్ని తక్షణమే అందించాలి.
3. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక నగదును వెంటనే విడుదల చేయాలి.
4. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రోత్సాహక నగదును నేరుగా జమ చేయాలి.
5. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, త్వరితగతిన పరిష్కరించాలి.
6. భవిష్యత్తులో ఎక్స్‌గ్రేషియా, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు పెండింగ్ కాకుండా సకాలంలో నిధులు విడుదల చేయాలి.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు గాదె నరసింహ, ఒంటెపాక కృష్ణ, సహాయ కార్యదర్శులు బొల్లు రవీంద్ర కుమార్, కోడిరెక్క మల్లన్న, జిల్లా కమిటీ సభ్యులు దైద శ్రీను, దంతాల నాగార్జున, దైదా దేవయ్య, బొల్లంపల్లి పాపారావు, దున్న అచ్చాలు, బొంగరాల వెంకటయ్య, మాతంగి రవికుమార్, దోరేపల్లి మల్లయ్య, వెంకట్, బండి నారాయణ, లింగస్వామి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శాలిగౌరారం లో నల్ల బ్యాడ్జీలతో నిరసన




నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్తా వేదిక సూర్య )
శాలిగౌరారం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నుండి మండల అధ్యక్షులు చింత దనుంజయ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ,అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీరును ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింత ధనంజయ మాట్లాడుతూ..బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తాతా మధు ను శాశ్వతంగా ఎమ్మెల్సీ పదవ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మహిళా అధికారులపై చేసిన దాడులను ఖండిస్తున్నామని,ఎర్రబెల్లికి దళితులు వచ్చారని,పసుపు నీళ్లతో శుద్ధి చేయడమంటే బిఆర్ఎస్ పూర్తిగా దళిత వ్యతిరేక పార్టీ అని అన్నారు.
ప్రజల్లో ఆదరణ తగ్గిపోయి ఫామ్ హౌస్ కి పరిమితమైన కేసీఆర్ ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూసి ఓర్వ లేక తమ దొర అహంకారాన్ని నిరూపిస్తున్నాడని,దళిత స్పీకర్ ను అవమాన పరిచారు.అసెంబ్లీ సమావేశాల రూల్స్ కు విరుద్ధంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించడం సభ్య సమాజం గమనిస్తుందన్నారు.ఆనాడు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి అమలు చేయకపోగా ఆనాడు రాజయ్యను కొప్పుల ఈశ్వర్ ను అవమానించిన చరిత్ర కెసిఆర్ కు ఉంది. ప్రతిపక్ష నేతగా ఆనాడు మల్లు భట్టి విక్రమార్క అంటే దళితుడి ప్రతిపక్ష నేతగా ఉన్నాడని కెసిఆర్ తమ అక్కసు తో భట్టి విక్రమార్కలు ప్రతిపక్ష నేతగా లేకుండా చేశారన్నారు.రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు నిన్ను మరోసారి బొంద పెట్టేందుకు సిద్దంగా ఉన్నారన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు నిసిగ్గుగా ప్రవర్తిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహా,సర్పంచ్ లు నరిగె యాదయ్య,కట్టగూరి సురేందర్ రెడ్డి,వంగూరి కవిత వెంకన్న,సుంచు నర్సింహ,మాజీ సర్పంచ్ లు బొమ్మగాని రవి,భూపతి వెంకన్న,షేక్ ఇంతియాజ్,మాదగోని అంజయ్య,మాజీ యంపిటీసి తీర్పారి మల్లయ్య,నోముల జనార్దన్,జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు లిపెరుమాండ్ల నరేష్,జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వడ్లకొండ పరమేశ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లికొండ గణేష్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్,గౌరారం,ఆకారం గ్రామ ఉప సర్పంచ్ లు తాటిపాముల పాపారావు,ఐతగోని లక్ష్మయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దేవరకొండ జయరాజ్,బోడ దానయ్య జాలోనిగూడెం,కొండారం గ్రామశాఖ అధ్యక్షులు జమ్ము అశోక్,పల్స సైదులు మండల కాంగ్రెస్ నాయకులు మంగదుడ్ల శ్రీనివాస్,తాటిపాముల రవి,చిత్తలూరి జీడికల్లు,తొట్ల పుల్లయ్య,ఐతగోని వెంకన్న,యూత్ కాంగ్రెస్ నాయకులు మాదగోని గోపి,చిల్లంశెట్టి సాయి గణేష్,గందమల్ల నాగార్జున,నిమ్మల మధు,కుంభం శివ,రావుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్

## రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి సోయి లేదు..

### మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):
రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం సోయి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డా. సి. లక్ష్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం స్టేజ్–3 పంప్‌హౌస్, గుడిపల్లి రిజర్వాయర్‌ను మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడి ప్రాజెక్టు ద్వారా సాగునీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు రైతుల సమస్యలపై మాట్లాడితేనే ప్రభుత్వం అప్రమత్తమవుతోందని విమర్శించారు. పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుపై పాదయాత్ర చేపడతామని ప్రకటించగానే ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు పర్యటించారని, అయితే పర్యటనలతో హడావుడి తప్ప ప్రాజెక్టు పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని అన్నారు.
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వరదలు వచ్చే ముందే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, నీటిని ఎత్తిపోసేలా ముందస్తు చర్యలు చేపట్టేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం రిజర్వాయర్లకు నీరు వచ్చినప్పటికీ లిఫ్ట్ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేసిందని ఆరోపించారు. తాము పంప్‌హౌస్‌ను సందర్శించిన సమయంలోనే మోటార్లు ఆన్ చేశారని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. వానాకాలం సాగుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను రైతులకు అందించకపోవడంతో రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని లక్ష్మారెడ్డి అన్నారు. పంటలు కాపాడేందుకు అవసరమైన సాగునీటిని సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**రైతులకు సాగునీరు అందే వరకు అండగా ఉంటాం...**

రైతులకు సాగునీరు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, శ్రేయస్సే తమకు ముఖ్యమని అన్నారు. గుడిపల్లి రిజర్వాయర్ పరిధిలోని రైతుల పంటలను కాపాడేందుకు పంప్ మోటార్లను నిరంతరం నడపాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

## రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి..

### బీజేపీ రాష్ట్ర నాయకులు డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి..

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):
రైతాంగానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జక్లేర్ హైవే రోడ్డుపై నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మన్తంగోడ్ వెంకట్రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉదయం, సాయంత్రం కొద్దిసేపు మాత్రమే లోవోల్టేజీ విద్యుత్ సరఫరా చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. తక్షణమే 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవాబుపేటలో ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు..

### 425 మంది విద్యార్థులతో క్రీడా పోటీలు..

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ):
విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో నవాబుపేట మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో క్రీడల్లో 14, 17 సంవత్సరాల బాలబాలికల విభాగాలకు చెందిన సుమారు 425 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నవాబుపేట గ్రామ సర్పంచ్ గీతారాణి సుధాకర్ చారి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం నాయక్ పాల్గొని ఖో–ఖో క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అలాగే కారుకొండ పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ దశరథ్ నాయక్ అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్ కుమార్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు మేరీ పుష్ప, గాయత్రి, నాగరాజు, ఖాజా, అర్చనలు రిఫరీలుగా వ్యవహరించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనగా, ఉపాధ్యాయులు, నిర్వాహకులు పోటీలను సమర్థవంతంగా నిర్వహించారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

### మహాసభకు భారీగా తరలిరావాలి: జుర్కి వెంకట్ రాములు

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ):
జర్నలిస్టుల హక్కులు, వృత్తి భద్రత, సంక్షేమం వంటి అంశాలపై సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు జుర్కి వెంకట్ రాములు అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ అనేక సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులపై రోజురోజుకూ బాధ్యతలు పెరుగుతున్నాయని తెలిపారు.
జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సంఘటితంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లు, ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న పాత్రికేయులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం తరఫున మరింత చురుకైన కార్యాచరణ చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్–143) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహబూబ్‌నగర్ జిల్లా జర్నలిస్టుల 3వ మహాసభకు ప్రాధాన్యత ఉందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మహాసభ జరుగుతుందని తెలిపారు.

# వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలి

**- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు: సుర్వి యాదయ్య గౌడ్**



**చౌటుప్పల్ సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య** వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సర్పంచుల సంగం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 8 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేకపోతుందని అన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ కోతలు, వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, పంపులు కాలిపోతూ రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను నిరంతరా యంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లో-వోల్టేజ్ సమస్యలు ఉన్న ప్రాంతా ల్లో అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ లైన్లను బలోపేతం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని సుర్వి యాదయ్య గౌడ్ స్పష్టం చేశారు.ఈ మహాధర్నాలో సీనియర్ నాయకులు తెలంగాణ బిక్షం, చిలువేరు బిక్షపతి, బొడ్డుపెల్లి గాలయ్య, జక్కిడి యాదిరెడ్డి, ఉపల ఆంజనేయులు, పాలకూర్ల సతీష్ గౌడ్, డాక్టర్ ఎర్రోళ్ల లింగస్వామి, రాసాల వెంకటేశం, చిలువేరు శంకర్, ఎడ్ల సత్తయ్య యాదవ్, ఎర్రోళ్ల వెంకటేష్, చిలువేరు వెంకటేశం, బొమ్మగోని రమేష్ గౌడ్, పవన్ కళ్యాణ్, నేనావత్ జగ్గు, మారగోని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి భువనగిరి



## పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పించేందుకు మట్టి విగ్రహాలను తయారీ




**మోత్కూరు, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):** పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పించేందుకే విద్యార్థులచే మట్టి విగ్రహణం తయారీ కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు మండలంలోని పాలడుగు పీఎం శ్రీ ఎంపీ యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటగిరి అన్నారు.శుక్రవారం ఆ పాఠశాలలో మట్టి వినాయకుల తయారీ విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని పరిరక్షించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వెంకటగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ రెడ్డి నియామకం



**మోత్కూరు, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య);** ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోత్కూరు పట్టణానికి చెందిన బండారు ప్రశాంత్ రెడ్డిని నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎడవల్లి వెంకటస్వామి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా,విద్యార్థి విభాగంలో చురుకుగా పని చేస్తుండడంతో తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు.తన నియమకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత్ రెడ్డికి ఆత్మీయ సన్మానం. ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియమితులైన బండారు ప్రశాంత్ రెడ్డిని డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి ఆదివారంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మెంట నగేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ సమీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏరసానపల్లి సందీప్, ఉపాధ్యక్షులు అవిశెట్టి కిరణ్ కుమార్, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మెంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడిలో పోషణమాసం



**మోత్కూరు, సెప్టెంబర్ 10 ( వార్త వేదిక సూర్య):** గర్భిణీ స్త్రీలు,బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా కోరారు. శుక్రవారం మోత్కూరు 3వ, అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, 0బి6 సంవత్సరాల పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు సైదమ్మ, రేణుక అంగన్వాడి టీచర్ దాసరి యాకలక్ష్మి, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సోమనాథ క్షేత్రంలో.. శాంతి సమత్వ దినోత్సవం







**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య :**శ్రీ సోమనాథ క్షేత్రంలో శాంతి సమత్వ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాంతి యుగస్థాపకులు శ్రీ సోమనాథ మహర్షి ఆదేశానుసారం ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చౌటుప్పల్ పురపాలిక చైర్ పర్సన్ ముగుదాల పావని రమేష్ గౌడ్ చేతులమీదుగా శివలింగానికి క్షీరాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. మహర్షి చిత్రపటంతో ఆయన భక్తులు నిర్వహించిన నగర సంకీర్తనలు పురపాలక చైర్పర్సన్ మోగదాల పావని, రమేష్ గౌడ్లు పాల్గొన్నారు. మహర్షులవారికి అఖండ దీపారాధన చేశారు. క్షేత్ర కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ చేతుల మీదుగా ప్రణవ, శాంతి పతాకాలను ఆవిష్కరించారు. సామూహిక ధ్యానం చేశారు. వేదమూర్తులచే మృత్యుంజయ యాగం, అక్షర లక్ష్య యాగం శాస్త్రవేత్తంగా జరిపారు. శ్రీ సోమనాథ మహర్షి భక్తులు శిష్యులు సామూహికంగా శతక పారాయణం చేశారు. ఈ ఉత్సవాల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, క్షేత్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు మండలోజు సుభాష్ చారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్, ఉప కార్యదర్శి చిరువెల్ల రవీందర్, కోశాధికారి ఊరా కృష్ణమూర్తి, మహర్షి శిష్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హన్మాపూర్ బ్రిడ్జి వద్ద వాహనదారుల అవస్థలు

**- సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటూ**

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి**



**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 11 (వార్త వేదిక సూర్య):**భువనగిరి నియోజకవర్గంలోని హన్మాపూర్ బ్రిడ్జి వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి వద్ద రహదారి పరిస్థితులు, వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఈ సమస్యకు సంబంధించిన దృశ్యాలను ఓ మిత్రుడు వీడియో రూపంలో పంపించగా, హన్మాపూర్ బ్రిడ్జి వద్ద నెలకొన్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని హన్మాపూర్ బ్రిడ్జి వద్ద సమస్యను పరిశీలించి, తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని వాహనదారులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు: సీపీఐ

**- మోటకొండూరులో ప్రారంభమైన సాయుధ పోరాట వార్షికోత్సవాలు**



**మోటకొండూరు, సెప్టెంబర్ 11 (వార్త వేధిక సూర్య):**-మోటకొండూరు మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రెడ్డిగట్టు శేషయ్య స్తూపానికి సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర ప్రజా ఉద్యమమని కొనియాడారు. ఈ ప్రాంతంలో రావి నారాయణరెడ్డి, రెడ్డిగట్టు శేషయ్య వంటి మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, భూమి, ఉపాధి, విద్య, వైద్యం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు జివిలికపెల్లి పాండు, బీరకాయల మధు, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు దామెర లక్ష్మి, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు బీరకాయ సిద్దుల కుమారస్వామి, ఎర్ర కృష్ణయ్య, జివిలికపల్లి నాగరాజు, జివిలికపల్లి నరసింహులు, కొరుటూరి నరసింహ, ఎత్తరు యాదగిరి, బుడిగే సిద్దయ్య, వడ్డేబోయిన బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ





**చౌటుప్పల్ సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ వద్ద అమావాస్య సందర్భంగా చౌటుప్పల్ మండల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున పేదలకు బస్టాండ్ వద్ద అన్న ప్రసాదం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతున్నది అన్ని దానాల్లోకెల్లా అన్నదానం నిన్న అని చౌటుప్పల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ళ శ్రీనివాస్ దాచేపల్లి విజయ్ నీల రమేష్ ఈరెంటీ సీతారాములు నీలా సత్యనారాయణ వీర బ్రహ్మ శోభన్ బాబు కేశవులు సముద్రాల శీను వికాస్ కోటగిరి నాగరాజు గజ్జల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ పోరాట స్ఫూర్తితో భూ పోరాటాలు

**- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరణలను తిప్పికొట్టాలి.. నాటి యోధుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలి**

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పిలుపు**




**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య :**భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలు, జాగీర్దారులు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా భూ పోరాటాలను విస్తృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు తెలిపారు. నాటి పోరాట చరిత్రను హిందూ--ముస్లింల మధ్య జరిగిన వివాదంగా చిత్రీకరిస్తూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న వక్రీకరణలను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.శుక్రవారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు మాట్లాడుతూ.. నాటి తెలంగాణలో నైజాం సర్కార్, జమీందారులు, భూస్వాములు, రజాకార్ల నిర్బంధం, వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారులు ఐక్యంగా పోరాడారని తెలిపారు.

**'దున్నేవాడికే భూమి' నినాదంతో మహోన్నత పోరాటం**

ఎర్రజెండా నాయకత్వంలో 'దున్నేవాడికి భూమి కావాలి.. వెట్టి చాకిరి పోవాలి' అనే నినాదాలతో సాగిన మహోన్నత పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని వెంకట్రాములు పేర్కొన్నారు. ఈ పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాలకు పైగా భూమి పేదలకు దక్కిందని, మూడు వేలకు పైగా గ్రామాలు విముక్తి పొంది గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు.ఈ పోరాటంలో నాలుగు వేల మందికి పైగా ప్రజలు, కమ్యూనిస్టు యోధులు, రైతు కూలీలు ప్రాణత్యాగం చేశారని చెప్పారు. కౌలు రైతులకు భూములపై హక్కు కల్పించే కౌల్దారీ చట్టాన్ని సాధించడంలోనూ ఈ పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. నాటి యోధుల పోరాట ఫలితంగానే నేడు పేదలు అనుభవిస్తున్న ఇనాం, అసైన్డ్‌మెంట్, చెరువు శిఖం వంటి భూములు దక్కాయని వివరించారు.

**చరిత్రను వక్రీకరించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం**

ఇంతటి ఘన చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతపరమైన ఘర్షణగా చిత్రీకరించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వెంకట్రాములు విమర్శించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అమరుల రక్తతర్పణం జరిగిన ప్రతి గ్రామంలో సభలు, ఊరేగింపులు నిర్వహించి నాటి పోరాట స్ఫూర్తిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం అభివృద్ధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భూమి, కూలీ, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, సంక్షేమ పథకాల అమలు కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి, గుంటోజి శ్రీనివాస్ చారి, అల్లూరి కుమార్, సహాయ కార్యదర్శులు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల నర్సింహ, కొండపురం యాదగిరి, మానే సాలయ్య, గ్యార అండాలు, చింతల సుదర్శన్, యాట బాలరాజు, కొండే కిష్టయ్య, మేడి ముకుందం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ రత్న అవార్డు - 2026 అందుకున్న నీలం గణేశ్




**వలిగొండ: సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోపరాజు పల్లి గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులు నీలం గణేష్ తెలంగాణ ప్రభుత్వం భాష సంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ రత్న అవార్డు - 2026 అవార్డును అందుకున్నారు. శుక్రవారం సుందరయ్య కళానిలయం హైదరాబాదులో నిర్వహించిన జగతి ఆర్ట్స్ ఐదవ వార్షికోత్సవంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే మహోన్నత బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. అవార్డు అందుకున్న గణేష్ కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## బ్రిలియంట్ స్కూల్‌లో అలరించిన "మట్టి గణపతి" సందడి

**- పర్యావరణ హితమైన మట్టి వినాయకులనే పూజిద్దాం**

**- ప్రిన్సిపాల్ పావని కోటేశ్వరి**



**ఆత్మకూరు (ఎం),సెప్టెంబర్ 11,(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంవినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు స్థానిక బ్రిలియంట్ హైస్కూల్‌లో శుక్రవారం "మట్టి గణపతి" ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సొంతంగా తయారుచేసిన మట్టి వినాయక విగ్రహాలు, ఆకుల రూపాల్లోని గణనాథుల చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పావని కోటేశ్వరి మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులతో చేసే విగ్రహాల వల్ల నీరు, పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడు కోవడం మన అందరి బాధ్యత అని, అందుకోసం ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి గణపతులనే పూజించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ప్రకృతి పరిరక్షణపై అవగాహన, బాధ్యత పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ఉపాధ్యాయులు యాదగిరి, రజిత, వైష్ణవి, విజయ, మెహరాజ్, అశ్విని, లావణ్య, మౌనిక, గౌతమి, భవాని, అఖిల, అనుష, ఉమ, సింధూజ తదితరులతో పాటు విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య – VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 115 || శనివారం || సెప్టెంబర్, 12, 2026



# యాదాద్రి భువనగిరి

# ఉత్సాహంగా 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపికలు

- విద్యార్థులకు క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరం - ఎస్సై కుమార స్వామి
- క్రీడాస్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించాలి -సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్
- మోటకొండూరులో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడోత్సవాలు

మోటకొండూరు, సెప్టెంబర్ 11(వార్త వేధిక సూర్య):– మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పాఠశాలల క్రీడా ఎంపికలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడోత్సవాలను సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్ విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలని, తద్వారా మోటకొండూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఎస్ఐ బి. కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని సూచించారు. ఖోఖో పోటీలను లాంఛనంగా ప్రారంభించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎంఈఓ రఘురాం రెడ్డి మట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. నిరంతర సాధనతో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని కోరుతూ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చాడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాల గంగాధర్ రెడ్డి, ముత్తిరెడ్డిగూడెం హెచ్ఎం ఎండి గఫార్, మాటూరు హెచ్ఎం శ్రీకాంత్ రెడ్డి మండల ఫిజికల్ డైరెక్టర్లు నాతి మల్లేశం, కే. నాగరాజు, రజిత, గోపాల్ తో పాటు ఉపాధ్యాయ బృందం సభ్యులు కే. రాజగోపాల్, బి. ప్రభాకర్ రెడ్డి, ఏ. భాగ్యశ్రీ, ఎం. భవాని, యాస రాజశేఖర్ రెడ్డి, ఎన్. సుధారాణి, జి. విశ్వరూపం, శ్రవణ్ కుమార్, ఫరూక్, రమేష్, రేణుక తదితరులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొన్నారు.





## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి

: జిల్లా ఇంటర్ విద్యాధికారి సురేష్ రెడ్డి




భువనగిరి టౌన్, సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య : భువనగిరి పట్టణంలోని ఎలిమినేటి రుక్మమ్మ నర్సా రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భువనగిరి మున్సిపాలిటీ 31వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి సుమయ్య తబస్సుం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆహుతులను అలరించారు. సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తమ ప్రతిభతో కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీఎస్ఎన్ఆర్ (బి) ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందిని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మునిపంపుల హై స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వినాయక చవితి వేడుకలు




రామన్నపేట సెప్టెంబర్ 11( వార్త వేదిక సూర్య) : రామన్నపేట మండలం మునిపంపుల హై స్కూల్ లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. వందే మాతరం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు తమకు విద్యానందించే ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల విలువైన సూచనలను ఆసక్తిగా విన్నారు.
అదే విధంగా పాఠశాలకు 3 రోజులు సెలవులు రావడం తో పర్యావరణ హితమైన మట్టి వినాయకుణ్ణి విద్యార్థులే తయారు చేసి ముందస్తు వినాయక చవితిని ఘనంగా నిర్వహించడం జరిగింది. పాఠశాల ఎవీ దొడ్డి స్వామి విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ గురువులు అందించే విలువలతో కూడిన విద్యను పొంది గొప్పగా ఎదగాలని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని పర్యావరణం ను పరిరక్షించుకోవాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. వందేమాతరం ఫౌండేషన్ వాలంటీర్ గాదె పారిజాత, పాఠశాల శ్రేయోభిలాషి మన్నె పద్మా రెడ్డి, ఆా్రజ చైర్మన్ బతిని వెంకటమ్మ, ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, వెంకటేశ్వర్లు. మనోహర్ , వసంత,ఆా. మంజుల, త్రివేణి ప్రసాద్ , +. మంజుల, సరోజ, పాల్వంచ హరికిషన్, నాగలక్ష్మి , శ్రీశైలం, సునీత, ఆఫీస్ సిబ్బంది రాకేష్, జాకీర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు

## పద్య పఠనాన్ని ప్రతి విద్యార్థి సాధన చేయాలి




మోత్కూరు, సెప్టెంబర్ 11 ,(, వార్త వేదిక సూర్య); ఏకాగ్రత ధారణాశక్తిని పెంపొందించే పద్య పఠనాన్ని ప్రతి విద్యార్థి సాధన చేయాలని స్థానిక.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో మండల స్థాయి క్రీడోత్సవాలలో భాగంగా. విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకి ప్రత్యేకమైన పద్యాన్ని చదవడం వల్ల భాషా పరిజ్ఞానం తో పాటు ఏకాగ్రత ధారణాశక్తి వికాసం చెందుతుందని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశ్రాంత లెక్చరర్ వడ్డేపల్లి లక్ష్మీ నర్సయ్య గారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య ఇండ్ల రాంప్రసాద్ శ్రీనివాస్ లలిత కుమారి వెంకటయ్య సుధీర్ కుమార్ తొర్ర ఉప్పలయ్య,వెంకటాచారి ప్రవీణ్ రవి లింగయ్య రవికుమార్ కవిత, జయశ్రీ స్వప్న ,వెంకటేశ్వర్లు,అశోక్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు
- శ్రీ సాయి రాఘవేంద్ర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలు





యాదాద్రి భువనగిరి/వార్తా వేదిక సూర్య :–భువనగిరి పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్ గార్డెన్‌లో శ్రీ సాయి రాఘవేంద్ర ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 'ఫ్రెషర్స్ డే' వేడుకలను అత్యంత ఘనంగా, కోలాహలంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలకడంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ సింగనబోయిన మల్లేశం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ అనేది బలమైన పునాది లాంటిదని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించిన వారే జీవితంలో గొప్ప విజయాలు సాధిస్తారని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ నిలుగొండ వెంకటరాజు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వృత్తి విద్యా కోర్సులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వీటిని అభ్యసించడం ద్వారా యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని, త్వరగా స్థిరపడేందుకు ఈ కోర్సులు దోహదపడతాయని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అధికారిక కార్యక్రమం అనంతరం ప్రిన్సిపాల్ స్వయంగా విద్యార్థులతో కలిసి ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొని వారిలో మరింత జోష్ నింపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపక బృందం గాజుల వెంకటేష్, మల్లేష్, ఎన్. గీత, సంతోష్, పుష్ప, నర్మద, ఝాన్సీ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఎంతో ఉల్లాసంగా, ఆహ్లాదకరంగా సాగిన ఈ వేడుకలు విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## మట్టివిగ్రహాల పంపిణీ



చౌటుప్పల్ సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలతో పూజించడం బాధ్యతగా భావించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ మాజీ చైర్మెన్ వెన్ రెడ్డి రాజు అన్నారు
భారత్ సేవ సహకార ఫోరం చైర్మెన్ బస్వరాజు శ్రీనివాస్ సహకారంతో సీతారామాలయ చైర్మెన్ బొబ్బిళ్ల మురళి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మట్టివిగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని వెన్ రెడ్డి రాజు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో త్రినిటి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుర్వి నర్సింహా గౌడ్ రామాలయ డైరెక్టర్స్ ఆవుల ఏసు యాదవ్ వర్కాల రవి గౌడ్ గుర్రం పాండురంగం తదితరులు పాల్గొన్నారు

## మృతురాలి కుటుంభానికి ఆర్థిక సాయం అందజేసిన వాకిటి



వలిగొండ : సెప్టెంబర్ 11 ( వార్త వేదిక సూర్య ): వలిగొండ మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్కూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగదారి అశోక్,ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే బ్రహ్మాస్త్రం

- ఎస్సై కుమార స్వామి
- సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు



మోటకొండూరు/వార్త వేధిక సూర్య :– పెరుగుతున్న నేరాలను అదుపు చేయడంలో, ప్రజల ఆస్తులను రక్షించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మోటకొండూరు ఎస్సై బి. కుమారస్వామి యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఆవశ్యకత, నూతన కెమెరాల ఏర్పాటు మరియు పాత వాటి మరమ్మతులపై ప్రజలకు, వ్యాపారస్తులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్ను లాంటివని అభివర్ణించారు. ప్రతి వీధిలో, ప్రధాన కూడళ్లలో, వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఏవైనా అవాంఛనీయ ఘటనలు, దొంగతనాలు లేదా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కెమెరాలు ఉన్నాయన్న భయంతో నేరాలు చేసేందుకు కూడా దుండగులు వెనుకడుగు వేస్తారని తెలిపారు. అలాగే గతంలో ఏర్పాటు చేసి, సాంకేతిక కారణాల వల్ల పనిచేయకుండా మూలనపడిన సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కాలనీ వాసులు, యువక సంఘాలు, గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ తమ ప్రాంతాల్లో కెమెరాలను బిగించుకోవాలని, తద్వారా సురక్షితమైన గ్రామ వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, యువక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం..

- లోఓల్టేజీ నివారణకు నూతన ట్రాన్స్‌ఫార్మర్



భువనగిరి టౌన్, సెప్టెంబర్ 11 వార్త వేదిక సూర్య :భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు స్పందించి సమస్యలను పరిశీలించినట్లు వార్డు కౌన్సిలర్ షేక్ తాహేర్ బబ్లు తెలిపారు. 8వ వార్డులోని సరస్వతి దేవాలయం, నీలగిరి టాకీస్ సమీపంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విషయాన్ని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు.

అదేవిధంగా వార్డులో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. యాదవ్ బస్తీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నూతన బోరు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, ఏఈలను కోరగా, బోరు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. వార్డులోని సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులకు కౌన్సిలర్ షేక్ తాహేర్ బబ్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**